మన ఆచారములు - అంతరార్థములు

# నాట్యము

**- నిత్యానంద్.**

పూర్వము పెళ్ళిచూపులలో "అమ్మాయికి ఏమి నేర్పించారు? సంగీతము, నాట్యము, కుట్టుపని, వంటవార్పు వంటివి నేర్పించారా? ఎంతవరకు చదువుకుంది?" అని అడిగేవారు. "అమ్మాయి ఎత్తు ఎంత? అమ్మాయి చూడడానికి ఎలా ఉంటుంది? అమ్మాయి రంగు ఎలా ఉంటుంది? అమ్మాయి ఉద్యోగము చేస్తున్నదా? ఎంత సంపాదిస్తుంది?" అని అడిగే ఇప్పటి పరిస్థితి వేరనుకోండి. వాస్తవానికి భర్త విద్యావంతుడైతే, అతనొక్కడే విద్యావంతుడు. అదే ఇల్లాలు విద్యావంతురాలైతే, ఆ కుటుంబమంతా విద్యావంతులవుతారనేది మన పెద్దలు చెప్పేమాట. విద్య అంటే బి.ఏ చెయ్యడమో, ఎం.ఏ చెయ్యడమో లేదా ఇంజనీరింగ్ విద్యను పూర్తి చెయ్యడమో అనుకుంటే పొరపాటు. చక్కగా చదవడం, వ్రాయడం, మాట్లాడడం, మానవతా విలువలను పాటించడం, ఏది మంచిది? ఏది కాదు? అనే ఇంగితం కలిగి ఉండే వారిని విద్యావంతులని అనుకోవచ్చు. ఇది నిర్వచనం కాదు, అవగాహన కొఱకు చెప్పిన విషయము. అలాంటి విద్యావంతురాలయిన తల్లి పెంపకములో పిల్లలు సన్మార్గగాములు అయ్యే అవకాశము ఎక్కువ. అందుకే మనవాళ్ళు 'అది ఉగ్గుపాలతో నేర్చిన విద్య' అని వాడటము పరిపాటి. సరే ఇక ఉపోద్ఘాతమును ఆపి, అసలు విషయానికి వద్దాం!

ఇక ఇల్లాలు ఆధ్యాత్మిక చింతన కల వ్యక్తి అయితే, పిల్లలకు కూడా ఆధ్యాత్మిక చింతన అలవడే అవకాశములు మెండు. లలిత కళలతో ప్రావీణ్యము సంపాదించిన వారికి ఆధ్యాత్మిక సాధన చాలా సులభతరమైపోతుంది. కాకపోతే అవి నలుగురి మెప్పుకోసమో, వార్తలలోకెక్కడానికో చేస్తే ఉపయోగం శూన్యం. ఏకాగ్రతతో ఈ కళలను సాధనచేస్తే నిత్యముక్తులుగా (సంసారములో ఉంటూ కూడా ఎల్లప్పుడు ఆనందముతో, కష్టసుఖములు ఏవి ఎదురైనా మొక్కవోని ఆత్మవిశ్వాసముతో) మెలగగలిగే సామర్థ్యము కలుగుతుందనడంలో ఎంతమాత్రమూ సందేహము లేదు. మన పెద్దలు ఏనాడో వీటిని గ్రహించి పిల్లలకు నృత్యము, సంగీతము నేర్పించడం చేసేవారు. అలాగే హరికథ, బుర్రకథ, కోలాటం, తోలు బొమ్మలాట, చెక్కభజన, గర్బా, భాంగ్రా వంటి ఎన్నో జానపద కళలు ఆధ్యాత్మికముగా ఉన్నతిని సాధించడానికి ఎంతో ఉపయోగపడతాయి. నాట్యమును గురించి తీసుకుందాం. భరతనాట్యం, మోహినీ ఆట్టం, కూచిపూడి, ఒడిస్సీ, కథాకళి, కథక్ వంటి దక్షిణ మరియు ఉత్తర భారతదేశ నృత్య, నాట్య రీతులు చేసేవారి ఏకాగ్రతను బట్టి వారిని వేరే లోకములలో ఆవిష్కరించే శక్తి గలవి. వీటిలో ప్రతి రీతికి ఒక ప్రత్యేకమైన ఆహార్యం ఉంది. వీటికి ఎంతో ప్రాధాన్యముంది. ఉదాహరణకు జడ, జడగంటలు, పాపిడి బిళ్ళలు తీసుకుంటే వాటి అంతర్యము మనలో చాలామందికి తెలియదు. ఈ విషయమును తెలియజేసిన శ్రీమతి స్మితారాజన్ గారికి (మోహినీఆట్టం, కథాకళి మరియు భరతనాట్యములలో పేరెన్నికగన్న కళాకారిణి) ధన్యవాదములు. ఈ విషయములను మీకు తెలియజేయాలనే మా ప్రయత్నమును మీరు ఆదరిస్తారని తలుస్తాము.



*తలపై కుడి ప్రక్క, ఎడమ ప్రక్క వరుసగా సూర్యుడు, చంద్రుడు అనే ఆభరణములను, మధ్యగా నుదురును తాకునట్లు పాపిడి బిళ్ళను అమరుస్తారు. (మోహినీఆట్టం)*

భరతనాట్యము చేసే కళాకారులు జడను మూడు పాయలుగా చేసి, వాటిని అల్లుతూ, చివర జడకుప్పెలను కడతారు. ఇక్కడ మూడు పాయలు ఇడ, పింగళ, సుషుమ్న అనే నాడులను తెలియజేస్తాయి. తలపై కుడి ప్రక్క, ఎడమ ప్రక్క వరుసగా సూర్యుడు, చంద్రుడు అనే ఆభరణములను, మధ్యగా నుదురును తాకునట్లు పాపిడి బిళ్ళను అమరుస్తారు. జడకుప్పెలు కళాకారుని మూలాధార చక్రమును (వెన్నెముక క్రిందభాగము వద్ద) తాకునట్లు అమరుస్తారు. నాట్యారంభము చేసేటప్పుడు, తరువాత నాట్యము చేసేటప్పుడు కూడా చాలా సమయం 'అరమండి'లో (అర్ధగుంజీలు తీస్తున్నప్పుడు, క్రిందకు వంగి ఉన్నప్పటి స్థితిలో) ఉంటారు. ఈ స్థితివలన మూలాధారచక్రము ప్రేరేపింపబడుతుంది. దానికి నాట్యము చేసేటప్పుడు జడకుప్పెలు తగిలి మూలాధార చక్రము శక్తివంతమౌతుంది, తద్వారా కుండలినీశక్తి ఆవిష్కరించబడుతుంది. తరువాత అది ఇడ, పింగళ, సుషుమ్న నాడుల ద్వారా స్వాధిష్ఠాన, మణిపూరక, అనాహత, విశుద్ధి చక్రములద్వారా సహస్రార చక్రమును తాకుతుంది. అక్కడే ఈ మూడు నాడులు కలుస్తాయి. ఆ స్థితిలో జీవాత్మ, పరమాత్మల కలయికవలన కళాకారుడు జీవన్ముక్తిని పొందగలడనేది మన పెద్దల అనుభవము. నేటి కళాకారులలో అతి కొద్దిమంది మాత్రమే ఏకాగ్రతతో నాట్య ప్రదర్శనలిస్తున్నారు. నిజమైన కళాకారులు నాట్యం చేస్తే వారు నాట్యంలో లీనమైపోతారు. చూసేవారుకూడా మంత్రముగ్ధులౌతారు. ఇక్కడ ఎవరినీ తప్పుపట్టడము ఉద్దేశ్యముకాదు. కళవెనుక ఉన్న ప్రాధాన్యమును తెలియజెప్పడమే ఈ వ్యాసము ముఖ్యోద్దేశ్యము. ఈ నాట్య కళలను ముందుతరములకు అందించడం మన బాధ్యత. దానికై ఈ కళలను, ఈ కళలను ఆరాధించేవారిని ఆదరించడం మన కర్తవ్యం. *



*(భరతనాట్యము నకు సరిపడే అలంకరణ)* →